క్లుప్తంగా

సత్ప్రవర్తనతో మెలగాలి



పాత నేరస్తులు, రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ పి.శ్రీనివాసులు

బత్తలపల్లి: పాత నేరస్తులు, రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత నేరస్తులు, రౌడీ షీటర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీపై నమోదైన రౌడీ షీట్లను తొలగించేందుకు చాలా కష్టపడాల్సి ఉంటుందన్నారు. వీటికి దూరంగా ఉండాలన్నారు. మీ ప్రవర్తన మార్చుకోవాలని సూచించారు. గ్రామాల్లో ప్రశాంతంగా జీవించాలని, ఎవ్వరి జోలికి వెళ్లవద్దన్నారు.

స్టేజీ నిర్మాణం పూర్తి

తలుపుల: మండల కేంద్రంలోని ఎగువపేట సమీపంలో ఉన్న ఏటి గంగమ్మ ఆలయం వద్ద బురుజుపల్లికి చెందిన సి.రాజారెడ్డి ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.2 లక్షలతో చేపట్టిన స్టేజీ నిర్మాణం పూర్తయింది. ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. సేవాదళ్ జోనల్ ఇన్‌చార్జి డీకే బాబు పాల్గొని గంగమ్మ ఆలయం వద్ద రేకుల షెడ్డు, ఆలయం చుట్టూ ప్లాట్‌ఫాం ఏర్పాటు చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ రామకృష్ణా రెడ్డి, మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, ఎంపీపీ రఫీనాయక్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న

ధర్మవరం అర్బన్: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం దసరా పండుగను పురస్కరించుకుని పారిశుధ్య కార్మికులకు మున్సిపల్ చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తదితరులు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు నిరంతరం కష్టపడి పనిచేస్తుంటారన్నారు. వారికి దసరా పండుగకు వారికి ఇవ్వాల్సిన కొబ్బరినూనె, సబ్బులు, ఖాకీ బట్టలు, అటెండర్లకు తెల్ల బట్టలు, మహిళలకు చీరలను పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరి జట్టు విజయం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న దృశ్యం

మడకశిర: మడకశిర జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆదివారం ఆర్డీటీ ఆధ్వర్యంలో అనంత ప్రీమియర్ లీగ్ – 2023 అండర్ 15 పోటీలను నిర్వహించారు. మడకశిర– కదిరి జట్లు తలపడగా కదిరి జట్టు విజయం సాధించింది. డాక్టర్ క్రిష్ణమూర్తి తనవంతుగా క్రీడా సామగ్రి కోసం రూ.20 వేలు అందజేస్తానని ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఈసీ మెంబర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతులను ఊరేగింపుగా మోసుకెళ్తున్న భక్తులు

హిందూపురం టౌన్: దసర నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని నింకంపల్లి రోడ్డులో వెలసిన ఎల్లమాంబ ఆలయంలో ఎరుకుల కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం అమ్మవారికి జ్యోతుల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద నుంచి చిన్నమార్కెట్ మీదుగా భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని నైవేద్యంగా కల్లు ముంతలు, జ్యోతులను మోసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో ఎరుకుల సంఘం నాయకులు శంకరయ్య, ఆలయ కమిటీ అధ్యక్షుడు నంజప్ప, రమేష్, నారాయణ, నాగరాజు, యల్లప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

ధర్మవరం ఆర్డీఓగా రమేష్ రెడ్డి

ధర్మవరం: ధర్మవరం నూతన ఆర్డీఓగా జి.రమేష్ రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఆర్డీఓగా పని చేస్తున్న తిప్పేనాయక్ చిత్తూరుకు బదిలీ అయ్యారు. దీంతో వైఎస్సార్ జిల్లాలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పని చేస్తున్న రమేష్‌రెడ్డిని ధర్మవరానికి బదిలీ చేశారు. త్వరలోనే ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

దసరా శోభ..

బత్తలపల్లి: శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలో 8వ రోజు ఆదివారం వివిధ ఆలయాల్లో అమ్మవార్లు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారు, లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుడి ఆలయంలో అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. కొల్లాపురమ్మ, బళ్లారి దుర్గమ్మ, అంకాలమ్మ ఆలయాల్లోనూ, సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరక్షేత్రంలోని మహాంకాళీమాత ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భజన బృందాల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాలు నిర్వమించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలో ఆదివారం పండుగ శోభ సంతరించుకుంది. ప్రజలంతా పూలు, పూజా సామగ్రితో పాటు పండుగ సరుకులు, నూతన వస్త్రాలు, టెంకాయలు కొనుగోలు చేశారు.

కదిరి టౌన్: దసరా పండుగను పురస్కరించుకుని పట్టణంలోని బట్టల షాపులు, జనరల్ స్టోర్స్, పూల మార్కెట్లలో సందడి నెలకొంది. వేమారెడ్డి సర్కిల్, చౌక్ బజారు, వలీసాబ్ రోడ్డు, రాయలసీమ సర్కిల్, కోనేరు సర్కిల్, జీవిమాను సర్కిల్‌లో అంగళ్లు ప్రజలతో కిటకిటలాడాయి.

నల్లమాడ: నల్లమాడ సమీపంలో వెలసిన కొత్తబావి గంగమ్మ అమ్మవారు ఆదివారం దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు పి.నాగరాజు, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేపట్టారు.

నల్లచెరువు: మండల కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో దసరా నవరాత్రులను పురస్కరించుకుని ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు.

ముదిగుబ్బ: శరన్నవరాత్రుల సందర్భంగా మండల కేంద్రంలో వెలసిన వాసవీ మాత ఆదివారం మహిషాసురమర్దని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొత్తచెరువు: దేవీ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం స్థానిక పెద్దమ్మ తల్లి దేవాలయంలో అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు. అనంతరం అర్చకులు హోమం నిర్వహించారు.



బత్తలపల్లిలో కొల్లాపురమ్మ దేవిని విద్యుద్దీపాలతో అలంకరించిన దృశ్యం



ధర్మవరంలో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



కొత్తచెరువులో దుర్గాదేవి అలంకరణలో పెద్దమ్మ తల్లి



ధర్మవరం పట్టణంలో దుర్గాదేవి అలంకరణలో అక్కమ్మ దేవి



ముదిగుబ్బలో మహిషాసురమర్దిని అలంకరణలో వాసవీ మాత



నల్లచెరువులో దుర్గాదేవిగా వాసవి కన్యకా పరమేశ్వరి



నల్లమాడలో దుర్గాదేవి అలంకరణలో కొత్తబావి గంగమ్మ



బత్తలపల్లిలోని దుర్గామాత అలంకరణలో కొల్లాపురమ్మ



కదిరి పట్టణంలోని పూల మార్కెట్‌లో కిక్కిరిసిన జనం



ధర్మవరంలో నూతన వస్త్రాలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

దసరా శుభాకాంక్షలు





ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి

ప్రశాంతి నిలయం: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. జగన్మాత ఆశీస్సులతో నియోజకవర్గ ప్రజలంతా సుఖ శాంతులు, సిరి సంపదలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో విజయదశమి జరుపుకోవాలని కోరారు.

కదిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఆ భగవంతుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి విజయానికి ప్రతీకగా జరుపుకునే పండుగే విజయ దశమి అన్నారు.

దుర్గమ్మ ఆలయంలో పూజలు



మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రసిద్ధ దుర్గమ్మ ఆలయంలో ఆదివారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సుప్రియ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం హోమం వద్ద పూజలు చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు.

ఎమ్మెల్యేను కలసిన ఆర్డీఓ



ఎమ్మెల్యే సిద్దారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణ

కదిరి: కదిరి ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన సన్నీ వంశీకృష్ణ ఆదివారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని ఆర్డీఓకు ఎమ్మెల్యే సూచించారు. కదిరికి రింగ్‌రోడ్ తరహాలో నిర్మిస్తున్న బైపాస్‌రోడ్డు పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలన్నారు. భూసేకరణ విషయంలో ఎదురవుతున్న సమస్యలను త్వరగా పరిష్కరించాలని సూచించారు. తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ తెలిపారు. కార్యక్రమంలో కదిరి ఇన్‌చార్జ్ తహసీల్దార్ సునీత, వీఆర్ఓ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలుపుల: మండలంలోని ఓబులరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సన్నేబాషా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఆదివారం మృతి చెందాడు. స్థానిక నాయకులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే రూ.10 వేల సాయం పంపారు. ఈ మొత్తాన్ని మండల కన్వీనర్ ఫయాజ్ అహమ్మద్, గ్రామ కన్వీనర్లు దివాన్‌వలి, శ్రీరాములు తదితరులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

స్త్రీనిధి రుణాల దుర్వినియోగంపై కేసు నమోదు

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని మాధురి గ్రామైఖ్య సంఘం మహిళల స్త్రీనిధి రుణాల దుర్వినియోగంపై ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాలు.. డీఆర్‌డీఏ (వెలుగు)లో మాధురి గ్రామైఖ్య సంఘం మహిళలు స్త్రీనిధి పథకం కింద రుణాలు తీసుకున్నారు. ప్రతి నెలా కొంత మొత్తం చొప్పున తిరిగి స్త్రీనిధి అకౌంట్‌కు జమ చేస్తున్నారు. 2023 ఆగస్టు నెలకు సంబంధించి మహిళలు కట్టిన లోన్ డబ్బు రూ.86,900 మాధురి గ్రామైఖ్య సంఘం యానిమేటర్ చినగాని కల్పన స్త్రీనిధి అకౌంట్‌కు జమ చేసింది. అయితే యానిమేటర్ జమ చేసిన లోన్ డబ్బులు వాస్తవంగా డబ్బులు చెల్లించిన మహిళల లోన్ అకౌంట్లలో కాకుండా డబ్బు చెల్లించని వారి అకౌంట్లలో సర్దుబాటు చేయడం జరిగింది. డబ్బు చెల్లించని వారి అకౌంట్లలో డబ్బు సర్దుబాటు ఎలా జరిగిందో తేల్చాలంటూ యానిమేటర్ చినగాని కల్పన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం దొమ్మతిమర్రి నుంచి పెనుకొండకు ద్విచక్ర వాహనాల్లో మద్యం తరలిస్తుండగా పులేకమ్మ ఆలయం వద్ద రవి, రమేష్, సురేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. 11 కేసుల మద్యం స్వాధీనం చేసుకున్నారు.

టీడీపీ అవినీతిని ఎండగడదాం

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తిరూరల్: మాట నిలబెట్టుకున్నాం.. మరొక అవకాశం ఇస్తే మరింత మేలు చేస్తామని ప్రజలకు చెప్పాలని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 8, 12, 14 వార్డుల పరిధిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులతో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీలనే కాకుండా అనేక సంక్షేమ పథకాలను అమలు చేసిన విషయాలను ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతిని జనం ముందు ఎండగడదామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గ రూపురేఖలు మారాయన్నారు. నెలలోపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేతుల మీదుగా 193 చెరువులకు రూ.860 కోట్ల నిధులతో నీటిని నింపే కార్యక్రమానికి భూమిపూజ చేస్తామని వెల్లడించారు. పుట్టపర్తి కేంద్రంగా శ్రీసత్యసాయి జిల్లా సాధించడం, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సహకారంతో హైవే రోడ్లు మంజూరు చేయించుకున్నామని తెలిపారు. కోడూరు నుంచి ముదిగుబ్బ వరకూ ఎన్‌హెచ్ 342 రోడ్డు పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. పుట్టపర్తి అన్ని ప్రాంతాలకు జాతీయ రహదారులు మణిహారాలుగా మారి అభివృద్ధి లో పరుగులు పెడుతోందన్నారు. డిసెంబర్ 21న ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా పుట్టపర్తి కేంద్రంగా క్రికెట్ పండుగ నిర్వహిస్తామన్నారు. సుమారు 500కు పైగా జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తామన్నారు. చంద్రబాబు, పల్లె రఘునాథ్ రెడ్డి జనానికి అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చి ఏ ఒక్క హామీని నిలబెట్టుకోలేదన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్నారన్నారు. 99 శాతం హామీలు నెరవేర్చి రూ.2.40 లక్షల కోట్లు ప్రజలకు అందించడం జరిగిందన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కన్వీనర్ రంగారెడ్డి, ఉపాధ్యక్షురాలు శ్రీలక్ష్మి నారాయణ రెడ్డి, సాయి గీత, లక్ష్మీపతి, కేశప్ప, సరస్వతి, అబ్జర్వర్లు సూర్యగౌడ్, రమణారెడ్డి, నాగభూషణ, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా బుళపతి, అగ్రి అడ్వైజరీ బోర్డు జిల్లా అధ్యక్షుడు అవుటాల రమణారెడ్డి, మాధవ రెడ్డి, కౌన్సిలర్ పవన్, సింగిల్ విండో అధ్యక్షుడు నరసారెడ్డి, నల్లమాడ గంగిరెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ ఈశ్వర్ రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, గోకులం కవిత, భారతి భాస్కర్, నాయకులు మధుసూదన్ రెడ్డి, రఫీ, భాస్కర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, జ్యోతి రమణ, జ్యోతి కేశవ, సువర్ణ, మిద్దె గోపాల్ రెడ్డి, ఎద్దుల లక్ష్మీనారాయణ రెడ్డి, చిదంబర్ రెడ్డి, మారెప్ప,బీరే నారాయణ, గాజుల వెంకటేష్, గంగాద్రి, నాగిరెడ్డి, విజయభాస్కర్ రెడ్డి, రమేష్ రెడ్డి, కడపరాజ, రమేష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తే ఊరుకోం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తాడిమర్రి: ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డిపై విమర్శలు చేస్తే ఊరుకోం. ఖబడ్దార్ మధుసూదన్ రెడ్డి. కేతిరెడ్డిని విమర్శించే స్థాయి నీకేకాదు మీ అధినేత పవన్ కళ్యాణ్‌కు కూడా లేదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సొసైటీ ఆవరణలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు వైటీ చంద్రశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జొల్లిరెడ్డి అశ్వర్థు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పొరాళ్ల విజయభాస్కర్‌రెడ్డి తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యక్తిగత కక్షలతో కొందరు వ్యక్తులు తాగుబోతు రాజారెడ్డిపై దాడిచేస్తే దానిని ఎమ్మెల్యేకు అపాదించడం హాస్యాస్పదం అన్నారు. సొంత గ్రామంలో సర్పంచ్‌గా గెలవలేని దద్దమ్మవు నువ్వ అని ఎద్దేవా చేశారు. ఏనాడూ ప్రజల బాగోగుల కోసం పాటుపడని నువ్వు కేతిరెడ్డిని విమర్శించడం సరికాదని మండిపడ్డారు. కేతిరెడ్డిపై విమర్శలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడిచేవాడే కాని హత్యలు, దౌర్జన్యాలకు పాల్పడే వ్యక్తి కాదన్నారు. గుడ్ మార్నింగ్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని, పరిష్కరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆర్వేటి రామాంజినేయులు, నాయకులు తాడిమర్రి శ్రీధర్‌రెడ్డి, బందారు పెద్దఓబిలేసు, సల్లాపురం బాల రమణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, ఎంపీటీసీ చంద్రబాబు, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, నిడిగల్లు హనుమంతు, ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

అసత్య ఆరోపణలు మానుకోండి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి

బత్తలపల్లి: గుడ్ మార్నింగ్ ధర్మవరం కార్యక్రమం పేరుతో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నారు. ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు మానుకోవాలని జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి హితవు పలికారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 3వ వార్డు కౌన్సిలర్ జేసీబీ రమణ, సింగిల్‌విండో డైరెక్టర్ కాశప్ప, కో–ఆప్షన్ మెంబర్ కరీం సాబ్, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, పెదయ్య, బండి వీరనారప్ప, కుమ్మర వెంకటరమణ, ఉపేంద్రరెడ్డితో కలసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జనసేన నాయకుడిపై ఎమ్మెల్యే దాడి చేయించాడంటూ ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. ఎవరో వ్యక్తిగతంగా ఘర్షణలకు పాల్పడి, దాడులు చేసుకుంటే వాటిని రాజకీయం చేయడం సరికాదన్నారు. పద్ధతిగా మాట్లాడితే మంచిదని హెచ్చరించారు. ఇలాగే వ్యవహరిస్తే నడిరోడ్డులో బట్టలు ఊడదీసి కొట్టుకుంటూ పోతామని హెచ్చరించారు. రౌడీ రాజకీయం చేయడం ఎమ్మెల్యే కేతిరెడ్డికి అలవాటు లేదన్నారు. ఎమ్మెల్యేపై చౌకబారు విమర్శలు మానుకోవాలని హితవు పలికారు.

24న షిర్డీసాయిబాబా మహాసమాధి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని షిర్డీ సాయిమందిరాల్లో మంగళవారం మహా సమాధి వేడుకలు జరుగనున్నాయి. ఆదివారం స్థానిక వేమన టెలీఫోన్ భవన్ ఎదురుగా ఉన్న సాయిబాబా మందిరంలో సమావేశం జరిగింది. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని మధ్యాహ్నం మహా మంగళహారతి, అన్నప్రసాద వితరణ, సాయంత్రం దూపహారతి, రాత్రి భజన మండలి ఆధ్వర్యంలో భక్తిగీతాలాపనలుంటాయని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా అశ్వాఖుల్లాఖాన్ జయంతి

హిందూపురం టౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు అశ్వాఖుల్లాఖాన్ జయంతి వేడుకలను ఆదివారం పట్టణంలో ముస్లిం నగరా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, ముస్లిం నగారా అధ్యక్షుడు ఉమర్‌ఫారూక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో కాకోరి రైలు సంఘటనలో అశ్వాఖుల్లా ఖాన్, రామ్ ప్రసాద్ బిస్మిల్‌కు ఉరిశిక్ష పడిందన్నారు. మాతృభూమి కోసం ఉరికంబ మెక్కిన అశ్వాఖుల్లాఖాను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

నేడు వశికేరప్పకు ప్రత్యేక పూజలు



వశికారప్ప స్వామి మూలవిరాట్

రాప్తాడు: మండలంలోని మరూరులోని వశికేరప్ప స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. విజయదశమి బ్రహ్మోత్సవాలు పదిరోజులుగా నిరాటంకంగా జరుగుతున్నాయి. ఆదివారం ఆలయంలో ఆయుధ పూజను పురస్కరించుకొని కుల గురువు శాంతమూర్తి స్వామితో రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర బిల్వార్చన, మహామంగళ హారతితోపాటు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం స్వామిని వెండి గుర్రంపై ఊరేగించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వశికేరప్ప స్వామి డెవలప్‌మెంట్ ట్రస్ట్ చైర్మన్ బుడగ లక్ష్మీనారాయణ తెలిపారు. కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సవాలకు హాజరుకానున్న ప్రముఖులు: వశికేరప్ప స్వామి వెండి గుర్రం విజయదశమి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, హిందూపురం ఎంపీ గోరట్ల మాధవ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీపీ చిట్రెడ్డి జయలక్ష్మి, వైస్ ఎంపీపీలు బోయ రామాంజనేయులు, మన్నల వరలక్ష్మీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిట్రెడ్డి సత్యనారాయణ రెడ్డి హాజరు కానున్నారు.